# నిధులు రికవరీ చేస్తాం

## - అధికారికే 'ఉపాధి'పై స్పందించిన పీడీ...ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**అనంతపురం అర్బన్:** చట్టాన్ని కాపాడాల్సిన ఓ అధికారే చుట్టంగా మార్చుకొని ఉపాధి కూలీగా మారి పేద కూలీల సొమ్మును దుర్వినియోగం చేశారంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం అధికారే 'ఉపాధి' కథనం ఆ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. తమపై పెత్తనం చెలాయించిన అధికారే ఇలాంటి అక్రమ వ్యవహారానికి పాల్పడ్డారంటూ జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ సిబ్బంది చర్చించుకొని అవాక్కయ్యారు. ఇదిలా ఉంటే ఈ అక్రమ కథనంపై ప్రస్తుత డ్వామా పీడీ ఢిల్లీరావు సీరియస్‌గా స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం తప్పేనని ఆంధ్రోజ్యోతికి వెల్లడించారు. అందుకే ఇప్పటివరకు ఖర్చు పెట్టిన సొమ్మును మొత్తం రికవరీ చేస్తామన్నారు. ఆ పనులను వెంటనే రద్దు చేస్తామన్నారు. దీనిపై ప్రత్యేక నోట్‌ఫైలు తయారు చేసి కలెక్టర్‌కు పంపుతామన్నారు. ప్రభుత్వం చేసిన చట్టాల మేరకే అధికారులు పని చేయాల్సి ఉంటుందన్నారు. అలాకాకుండా విరుద్ధంగా వ్యవహరించి సొంత నిర్ణయాలను తీసుకోవడం తప్పేనన్నారు. రమేష్‌రెడ్డి కూడా ఓ ప్రత్యేక హోదాలో డ్వామాలో అధికారిగా పనిచేస్తున్నారని, ఇలా చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయని ఆలోచించాల్సి ఉండాలన్నారు. అయినా ఆ పని చేయలేదన్నారు. ఉపాధి పథకంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది చిన్నతప్పు చేసినా వారిని తొలగించడం, రికవరీ చేయడం, అవసరమైతే క్రిమినల్‌కేసులు నమోదు చేయిస్తున్నామన్నారు. అయితే ఇక్కడ అధికారులే తప్పు చేశారు. అందుకే ఈ వ్యవహారం రాష్ట్రశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. వారే దీనిపై తగిన చర్యలు తీసుకుంటారని పీడీ తెలియజేశారు. మొత్తంమీద ఈ అడిషనల్ పీడీ అక్రమ వ్యవహారం జిల్లాలోనే పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# సమన్వయంతో పనిచేస్తే సైన్స్‌ఫెయిర్ విజయవంతం

## వసతి, భోజన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: రాష్ట్ర పరిశీలకుడు ప్రొ. విజయ్‌కుమార్

**అనంతపురం అర్బన్:** అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసినపుడే సైన్స్‌ఫెయిర్‌ను విజయవంతం చేయవచ్చని రాష్ట్ర పరిశీలకుడు ఎస్‌సీఆర్‌టి ప్రొఫెసర్ విజయ్ కుమార్ సూచించారు. సైన్స్‌ఫెయిర్ అనంతపురంలో జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించడానికి ఆయన జిల్లాకు చేరుకున్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డీఈఓ శామ్యూల్, సైన్స్ క్యూరేటర్ రాఘవయ్య కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. అనంతరం పరిశీలకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రతిఏటా రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌ను ప్రభుత్వ నిర్వహిస్తున్నాదన్నారు. జిల్లాలో మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అధికారులు, కమిటీ సభ్యులు చాలా బాధ్యతగా పనిచేసి ఇటు జిల్లాకు, అటు రాష్ట్రానికి సైన్స్‌ఫెయిర్ నిర్వహణలో మంచిపేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా వివిధ జిల్లాలనుంచి వచ్చిన విద్యార్థులు, టీచర్లకు వసతులు, భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జడ్జ్‌మెంట్ విషయంలో జడ్జిల నిర్ణయమే కీలకమన్నారు. అయితే జడ్జిలు ప్రతి నమూనాను ఓపికతో చూడాలని, ఆ పిల్లలు చెప్పింది వినేలా చూడాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులు సౌత్ ఇండియాలో జరిగే జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారన్నారు. ఇన్‌స్పైర్ ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులు మనరాష్ట్రం నుంచి వెళ్లి ఢిల్లీ పోటీలలో పాల్గొన్నారన్నారు. ఇదే స్ఫూర్తితో మరింతమంది ప్రతిభ పిల్లలను పక్కాగా గుర్తించి జాతీయ పోటీలకు పంపేలా చూద్దామన్నారు. కమిటీలు అప్పగించిన బాధ్యతలను కమిట్‌మెంట్‌తో పనిచేయాలన్నారు. ఎవరికి అప్పజెప్పిన పనులు వారు బాధ్యతగా చేస్తే తప్పకుండా విజయవంతమవుతుందని, ఇందులో ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రదర్శనను తిలకించడానికి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను మాత్రమే రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైన్స్‌ఫెయిర్ ప్రారంభోత్సవ రోజున ప్రోటోకాల్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఎంలు చలపతి, తిప్పేస్వామి, వెంకటేశులు, గోపాలకృష్ణ, రవి నాయక్, లక్ష్మినారాయణ, రవీంద్రారెడ్డి, శివప్రసాద్, సైన్స్ టీచర్స్ భాస్కర్‌రెడ్డి, రంగయ్య, రాము, జయచంద్రతోపాటు 17 కమిటీల కన్వీనర్లు పాల్గొన్నారు.

**వెబ్‌సైట్ ప్రారంభం...** రాష్ట్ర సైన్స్‌ఫెయిర్‌కు సంబంధించి జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెబ్‌సైట్‌ను రాష్ట్ర పరిశీలకులు ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఇందులో సైన్స్‌ఫెయిర్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకోడానికి అన్ని విషయాలనూ పొందుపరిచారు. 23 జిల్లాలకు సంబంధించి ఎవరెవరు ఎవరిని సంప్రదించవచ్చో ఇందులో పొందుపరిచారు. అలాగే ఆహ్వానపత్రికలను ఈ సందర్భంగా విడుదల చేశారు.

# సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు



ఎలీషా డెంగ్యూ నిర్ధారణ పరికరాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్‌రావు

**పుట్టపర్తి రూరల్:** పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిలో ఇక నుంచి డెంగ్యూ పరీక్షల నిర్ధారణ పరీక్షలు అందుబాటులో రానున్నాయి. గురువారం సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎలీషా డెంగ్యూ నిర్ధారణ యంత్రాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు కార్యదర్శి ప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ యంత్రం విలువ రూ.35లక్షలు దాకా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి డైరెక్టర్ ఓలేటి చౌదరి మాట్లాడుతూ సామాన్యులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించడమే బాబా లక్ష్యమన్నారు. సాయిబాబా ఆశయ సాధనలో భాగంగా సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఈ ఎలీషా డెంగ్యూ నిర్ధారణ యంత్రాన్ని ప్రారంభించామన్నారు. ఇంతకుముందు రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ చేయాలంటే ఆరు గంటల దాకా సమయం పట్టేదన్నారు. అయితే ఎలీషా పరికరం ద్వారా కేవలం అర్ధ గంటలోనే వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. అంతే కాకుండా ఏక కాలంలో 400 రక్త పరీక్షలను చేయవచ్చన్నారు. ఎలీషా డెంగ్యూ నిర్ధారణ యంత్రంతో అత్యంత క్లిష్టమైన డెంగ్యూ నిర్ధారణ పరీక్షలే కాకుండా హెచ్‌ఐవీ, హెపటైటిస్ పరీక్షలు చేయవచ్చన్నారు. రాయలసీమ ప్రాంతంలోనే ఈ యంత్రాన్ని ప్రారంభించడం మొట్టమొదటి కావడం గమనార్హమన్నారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ మందికి మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ హెచ్‌ఓడి గురురాజ్ కుమార్ ఉన్నారు.

# 'ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి'

**అనంతపురం కార్పొరేషన్:** ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్ఓ సుదర్శన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు దాదాపు 5 లక్షల వరకు ఖాళీగా ఉన్నాయన్నారు. 2004, 2009 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తొమ్మిదేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నిరుద్యోగులు సంఖ్య గణనీయంగా పెరుగుతోందని జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప విమర్శించారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కా ర్యదర్శి వీరాంజినేయులు, నగర అధ్యక్షుడు వీరానంద, శివ, గణేష్, రంగస్వామి, సరిపూటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

### సీఎం సభకు లారీల తరలింపు ఫలితం

# ఎక్కడి యూరియా అక్కడే

## - అదనంగా 24 గంటలపాటు వ్యాగెన్ నిలుపుదల



యూరియాతో ఉన్న వ్యాగెన్, వ్యాగెన్ నుంచి ప్లాట్‌ఫాంపైకి యూరియాను దించుతున్న దృశ్యం

**(అనంతపురం కలెక్టరేట్ )** జేడిపల్లిలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బహిరంగ సభకు అధికారులు బలవంతంగా లారీలను తరలించారు. దీని ప్రభావం యూరియా సరఫరాపై పడింది. బుధవారం ఉదయం 10 గంటలకు 3వేల టన్నుల నాగార్జున యూరియాతో కూడిన వ్యాగెన్ అనంతపురం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. నిబంధనల మేరకు అదే రోజు రాత్రి 8 గంటలలోపు వ్యాగెన్‌లోని యూరియాను అన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. అయితే సీఎం సభకు లారీలు తరలించడంతో వ్యాగెన్‌ను నిలుపుదల చేశారు. వ్యాగెన్‌లోని యూరియాను అన్‌లోడ్ చేసుకునేందుకు ప్రతిసారి 100 లారీలనువాడుతున్నారు. యూరియా వ్యాగెన్ వచ్చిందని చెప్పినా వినకుండా సీఎం బహిరంగ సభకు అధికారులు బలవంతంగా లారీలను తరలించారు. నిబంధనల మేరకు నిర్దేశించిన సమయానికి అన్‌లోడ్ చేసుకోని పక్షంతో ప్రతి గంటకు రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది. అధికారుల దౌర్జన్యం మూలంగా ఎరువుల డీలర్లపై రూ. 1.50లక్షలకుపైగానే అనదపు భారం పడినట్లైంది. దీనిపై ఎరువులడీలర్లు మండిపడుతున్నారు. అదనపు భారాన్ని తగ్గించుకునేందుకు గురువారం మధ్యాహ్నం ప్లాట్ ఫారంపైనే యూరియా బస్తాను అన్‌లోడ్ చేయడం కనిపించింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్‌లోడ్ పూర్తవుతుందని ఓ ఎరువుల దుకాణం డీలర్ చెప్పుకొచ్చాడు.

# 1104 యూనియన్ సమ్మె తాత్కాలిక వాయిదా

## - సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

**(అనంతపురం కలెక్టరేట్ )** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగు సంఘం (1104) చేపట్టదలచిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంఘం రాష్ట్రనాయకులు జేఎండీతో చర్చలు జరిపారన్నారు. ఈ చర్చల్లో కొన్ని అంశాలపై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. 2008,2011 సంవత్సరాల్లో నియమించిన జేఎల్ఎం,సీజేఎల్ఎంలకు కోర్టుద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. 1986 నుంచి 2001వరకు జేఎల్ఎం,ఎల్‌డీసీలకు ఒక నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వనున్నారన్నారు. ఇందులో 1993-94 బ్యాచ్ ఉద్యోగులను మినహాయించారన్నారు. కొత్తగా ఏర్పడిన సెక్షన్లకు రెండు ఎల్ఐ పోస్టులను కేటాయించేందుకు అంగీకరించారన్నారు. మాజీ రెస్కో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఒప్పుకున్నారన్నారు. వీటితో పాటు మరిన్ని సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 5 నుంచి చేపట్టాలని నిర్ణయించిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు.

# 'సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల అంగీకారం'

**(అనంతపురం,కలెక్టరేట్ )** విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం అంగీకరించిందని విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ యూనియన్ రాష్ట్రనాయకులు ఇదివరకే పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు సమర్పించారన్నారు. పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టడంజరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకులు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయన్నారు. 2007 సంవత్సరంలో ఉద్యోగం చేరిన జేఎల్ఎంలకు పదోన్నతులు కల్పించనున్నారన్నారు. ప్రమాదం జరిగిన సమయాల్లో ఉద్యోగికి డిజేబిలిటీ లీవ్‌ను ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. కాంట్రాక్ట్ జేఎల్ఎంలకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి అంగీకరించారన్నారు. మరణించిన రెస్కో కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలకింద ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. వీటితోపాటు మరిన్ని సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులు ఒప్పుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, రాష్ట్ర నాయకులకు సంఘం జిల్లా నాయకులు నాగరాజు, రాఘవేంద్రహర్ష, అనంతపురం డివిజన్ నాయకులు రామాంజినేయులు,గంగాధర్, ఈశ్వరయ్య తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.